సాక్షి
వికారాబాద్
సోమవారం ◆ 1 ◆ సెప్టెంబర్ ◆ 2025



పంటలు భద్రం

సాధారణ వర్షపాతం పంటలకు ఎంత మేలు చేస్తుందో.. అధిక వర్షపాతం అంతకన్నా ఎక్కువ నష్టం చేస్తుంది. 8లో▸



కార్మికులే కీలకం

పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చడంలో కార్మికులదే కీలక పాత్ర అని మున్సిపల్ కమిషనర్ యాదగిరి అన్నారు. 8లో▸



గొంగళ్లకు ఆదరణ కరువు!

గొంగడి అంటేనే గ్రామీణప్రాంతాలకు చిహ్నంగా కనిపించేవి. నెత్తిన రుమాలు, భుజాన గొంగడి వేసుకునేవారు. 9లో▸

న్యూస్‌రీల్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

టీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ ముదిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్ ముదిరాజ్

దౌల్తాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజు కులస్తుల సత్తా ఏమిటో చూపించాలని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని మాటూరు గ్రామంలో నియోజకవర్గ అధ్యక్షుడు హన్మంతు ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ సామాజిక వర్గంలో అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న వారు ముదిరాజ్‌లేనన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని పార్టీలు అత్యధిక సీట్లు కేటాయించాలని కోరారు. అలాగే బీసీ – డీ నుంచి బీసీ – ఏకు రిజర్వేషన్ మార్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాగుల రాజు, అశోక్, రంజిత్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘కలరిపయట్టు’కు ఎక్స్‌క్లూజివ్ వరల్డ్ రికార్డ్ అవార్డు

అడిషనల్ డీసీపీ రామదాసు చేతుల మీదుగా ప్రదానం



అవార్డు అందుకుంటున్న రమేష్

కొడంగల్ రూరల్: అతి ప్రాచీన యుద్ధ విద్య కలరిపయట్టుకు ఎక్స్‌క్లూజివ్ వరల్డ్ రికార్డ్ అవార్డు దక్కింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ అండ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామదాసు చేతుల మీదుగా కలరిపయట్టు నిర్వాహకుడు రమేష్ ఆచార్య అవార్డు అందుకున్నారు. ప్రాచీన యుద్ధ విద్యను ప్రోత్సహిస్తున్న రమేష్‌ను అభినందించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఘణపూర్‌లో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రంగరాములును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఘణపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో శంకర్‌పల్లి యువకుడి సత్తా



మెడల్ అందుకుంటున్న వరుణ్ గౌడ్

శంకర్‌పల్లి: డిస్కస్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో మండల పరిధిలోని కొండకల్ గ్రామానికి వరుణ్ గౌడ్ సత్తా చాటాడు. రెండు రోజుల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు వర్సిటీలో ప్రారంభమైన 11వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2025 పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అండర్–18 డిస్కస్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో వరుణ్‌గౌడ్ సత్తా చాటి, రెండింటిలోనూ ద్వితీయ స్థానంలో నిలిచాడు. బాసర ట్రిపుల్ ఐటీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వరుణ్ గౌడ్ విజయాలపై తల్లిదండ్రులు కల్పన, లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు.



విద్యుత్ కాంతుల వెలుగులో ఊరేగింపు



వినాయక విగ్రహానికి పూలు చల్లుతున్న పోలీసు అధికారులు



పాత తాండూరు గడి ప్రాంతంలో శోభాయాత్ర

గంగమ్మ చెంతకు గణనాథుడు

ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణేశుడు ఆదివారం గంగమ్మ ఒడికి చేరాడు.. తాండూరు పట్టణంలో ప్రతిష్ఠించిన విగ్రహాలను యాలాల మండలం కోకట్ కాగ్నా నదిలో నిమజ్జనం చేశారు. అంతకుముందు పట్టణంలో నేత్రపర్వంగా శోభాయాత్ర సాగింది. వేలాది మంది భక్తులు ఈ వేడుకలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.. గణేశ్ మహరాజ్‌కి జై అంటూ ముందుకు సాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. – తాండూరు




గణనాథుల ఊరేగింపు భక్తులు



పాత తాండూరులో సందడి

రింగ్ మరింత చేరువ

- జిల్లా కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరం నుంచే రీజనల్ రింగ్ రోడ్డు
- దక్షిణ ట్రిపుల్ ఆర్‌పై తొలగిన సందిగ్ధత
- మార్చిన అలైన్‌మెంట్ తయారీకి హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్
- ఈ నెల 15లోగా అభ్యంతరాలకు అవకాశం
- జిల్లాలోని నాలుగు మండలాలను కలుపుతూ..



రీజనల్ రింగ్‌రోడ్డు కొత్త ప్రతిపాదిత నమూనా

వికారాబాద్: జిల్లా మీదుగా రీజనల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) అలైన్‌మెంట్ ఖరారైంది. రెండు రోజుల క్రితం హెచ్‌ఎండీఏ ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నెల 15వ తేదీలోగా అభ్యంతరాలను తెలపాలని సూచించింది. గతంలో తయారు చేసిన అలైన్‌మెంట్ ప్రకారం పడమర ప్రాంతంలో రీజనల్ రింగ్‌రోడ్డు హైదరాబాద్‌కు 45 నుంచి 50 కిలోమీటర్ల దూరం నుంచి రంగారెడ్డి జిల్లాకే పరిమితం చేస్తూ మొదటి డీపీఆర్‌ను సిద్ధం చేశారు. దీంతో ట్రిపుల్ ఆర్ మన జిల్లా మీదుగా వెళ్తుందా లేదా అనే సందేహం ప్రజల్లో ఉండేది. తూర్పు, ఉత్తర, దక్షిణ ప్రాంతాలతో పోలిస్తే మన జిల్లా సరిహద్దు కలిగి ఉన్న పడమర ప్రాంతంలో రీజనల్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు తక్కువ దూరం(వికారాబాద్‌కు ఎక్కువ దూరం) నుంచి నిర్మిస్తున్నారని జిల్లా నేతలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు. మిగతా భాగాల్లో హైదరాబాద్‌కు 60 నుంచి 90 కిలోమీటర్ల దూరం నుంచి ట్రిపుల్ ఆర్ నిర్మించేలా అలైన్‌మెంట్ తయారు చేయగా.. వికారాబాద్ జిల్లాను కలుపుతూ వెళ్లే పడమర ప్రాంతంలో 50 నుంచి 55 కిలోమీటర్ల దూరం నుంచే వెళ్లేలా అలైన్‌మెంట్ తయారు చేశారు. దీంతో పశ్చిమ ప్రాంతాన ఉన్న మన జిల్లాకు అన్యాయం జరుగుతుందని, అభివృద్ధి ఆగిపోతుందని జిల్లా నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా హెచ్‌ఎండీఏ ప్రతిపాదించిన దాని ప్రకారం మన జిల్లాకు చేరువగా ఆరు కిలోమీటర్ల దూరం నుంచి రీజనల్ రింగురోడ్డు వెళ్లనుంది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాజా నోటిఫికేషన్ ప్రకారం..

గతంలో తయారు చేసిన డీపీఆర్‌లో పొందు పర్చిన అలైన్‌మెంట్‌లో పడమర ప్రాంతంలో మన జిల్లా సరిహద్దు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆలూరు – కొకుంట్ల గ్రామాల మధ్యలోంచి తంగెడుపల్లి మీదుగా ట్రిపుల్ ఆర్ వెళ్లేలా ప్రతిపాదించారు. వికారాబాద్ జిల్లాలోని పూడూరు, నవాబుపేట మండలాల పరిధిలోని ఒకటి రెండు గ్రామాల నుంచి వెళ్లేలా డిజైన్ చేశారు. తాజా ప్రతిపాదనల్లో జిల్లా పరిధిలోని నాలుగు మండలాలను కలుపుతూ ట్రిపుల్ ఆర్ వెళ్లనుంది. పూడూరు, నవాబుపేట మండలాల పరిధిలోని పదిహేను గ్రామాలకు పైగా రీజనల్ రింగ్‌రోడ్డు పరిధిలోకి వస్తుండగా వికారాబాద్, మోమిన్‌పేట మండలాల పరిధిలోని ఐదు గ్రామాల చొప్పున కొత్త ప్రతిపాదనలు తయారు చేశారు. పూడూరు మండలంలోని గొంగుపల్లి, గట్‌పల్లి, కెరవెళ్లి, మంచన్‌పల్లి, మన్నెగూడ, పెద్ద ఉమ్మెంతాల్, పూడూరు, రాకంచర్ల, సిరిగాయపల్లి, తుర్కెన్కెపల్లి, ఎన్కెపల్లి మీదుగా ట్రిపుల్ ఆర్ వెళ్లనుంది. నవాబుపేట మండలంలోని చించల్‌పేట్, చిట్టిగిద్ద, దాతాపూర్, వట్టిమీనపల్లి, యావాపూర్.. వికారాబాద్ మండలంలోని పీరంపల్లి, పులుసుమామిడి, బురాన్‌పూర్, పాతూర్ గ్రామాల మీదుగా వెళ్లనుంది. మోమిన్‌పేట మండలంలోని దేవరంపల్లి, టేకులపల్లి గ్రామాల మీదుగా రీజనల్ రింగ్ రోడ్డు వెళ్లనుంది.

వేగంగా అభివృద్ధి

రీజనల్ రింగ్ రోడ్డు అందుబాటులోకి వస్తే చుట్టుపక్కల ప్రాంతాలు, పట్టణాలు, గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. హైదరాబాద్‌కు కనెక్టివిటీ పెరుగుతుంది. స్థానికంగా ఉపాధి, ఉత్పాదకత మెరుగుపడుతుంది. రోడ్డుకు ఇరువైపులా పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుంది. భూముల ధరలు పెరుగుతాయి. మోమిన్‌పేట్, నవాబుపేట, శంకర్‌పల్లి, వికారాబాద్, పరిగి తదితర పట్టణాల మీదుగా వెళ్లే మార్గాలను ఫోర్, సిక్స్ లైన్లుగా మారి నగరానికి కనెక్టివిటీ పెరుగుతుంది. దీంతో పశ్చిమాన ఉన్న మన జిల్లా రైతులు కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటి ఉత్పత్తులను నగరానికి తరలించడానికి అనుకూలంగా ఉంటుంది.



మాట్లాడుతున్న కృష్ణ పంతులు

6న వికారాబాద్‌లో నిమజ్జనం

హిందూ ఉత్సవ సమితి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఈ నెల 6న జరగనున్న గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని హిందూ ఉత్సవ సమితి కన్వీనర్ కృష్ణ పంతులు కోరారు. ఆదివారం వికారాబాద్‌లోని రామ్ మందిరంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిమజ్జనం, శోభాయాత్ర, ఏర్పాట్లపై మండప నిర్వాహకులు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు విగ్రహాలను కొత్తగంజ్ వద్దకు వచ్చేలా చూడాలన్నారు. శోభాయాత్ర మార్గంలో గుంతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ తీగలు కిందకు ఉంటే సరి చేయాలని కోరారు. ప్రధాన రహదారుల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా మున్సిపల్ అధికారులు చొరవ చూపాలని విన్నవించారు. అవసరమైన చోట పెద్ద దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎబ్బనూర్ చెరువు వద్ద క్రేన్‌లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అనంతరం సీఐ భీంకుమార్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణలో నిమజ్జనం జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, నాయకులు డాక్టర్ సత్యనారాయణగౌడ్, రాఘవేందర్, ప్రశాంత్‌కుమార్, దత్తు, అనంత్‌రెడ్డి, మేక శేఖర్‌రెడ్డి, మోముల రాజ్‌కుమార్, సుభాన్‌రెడ్డి, అవుసుల అశోక్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, ఫైర్ శాఖల అధికారులు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధి అభినందనీయం

- హైదరాబాద్ పారిశ్రామికంగా, సాంకేతికంగా ఎంతో పురోగతి
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- జినుగుర్తి గ్రామ ఏకలవ్య గురుకులంలో హాస్టల్ ప్రారంభం



హాస్టల్ భవనాలను ప్రారంభించి మాట్లాడుతున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్

తాండూరు రూరల్: దేశంలో హైదరాబాద్ నగరం పారిశ్రామికంగా, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందడం అభినందనీయమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఆదివారం తాండూరు మండలం జినుగుర్తి గ్రామ శివారులోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సందీపని గురుకుల పాఠశాలలో హాస్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎటువంటి మార్పునకైనా గ్రామీణ ప్రాంతాల నుంచే ఉద్యమం ఉండాలన్నారు. భారత్ స్వరాజ్య దేశంగా ఎదగాలని, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలంటే అందుకు ఏకలవ్య గురుకులాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రతి పాఠశాలలో యోగా అమలు చేయాలని, దీని వల్ల శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సందీపని గురుకుల విద్యాప్రమాణాలను కొనియాడారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రాంతానికి నవోదయ పాఠశాల మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఆ తర్వాత కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. తాను చదువుకోవడంతోనే ఈ స్థాయిలో ఉన్నానని.. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి సతీష్‌చంద్ర, ఎస్పీ నారాయణరెడ్డి, ఎస్‌బీహెచ్ చీఫ్ జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత్ కార్యకార్యణి ప్రతినిధి భాగయ్య, డీఈఓ రేణుకాదేవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎస్ అంతం.. పీఆర్‌టీయూ పంతం

అనంతగిరి: సీపీఎస్ రద్దు కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సోమవారం నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం వికారాబాద్ పట్టణంలో అన్ని మండలాల కమిటీ ప్రతినిధులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ అంతం పీఆర్‌టీయూ పంతం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండలాల నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి మార్గాలను పాటించాలి



మాట్లాడుతున్న వారణాసి శ్రీరామచంద్రమూర్తి

అనంతగిరి: ఆయువు ఉన్నప్పుడే.. ఆయాసం రానప్పుడే హరినామస్మరణ చేయాలని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ అధికారి, ఆధ్యాత్మికవేత్త వారణాసి శ్రీ రామచంద్ర మూర్తి తెలిపారు. ఆదివారం వికారాబాద్‌లోని శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్రం 23వ వార్షికోత్సవ ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ సత్యసాయి పంచరత్నాలైన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస మార్గాలను పాటించాలన్నారు. పరమాత్ముడిని నమ్ముకున్న వారు ఎన్నటికీ చెడిపోరని తెలిపారు. అనంతరం జ్ఞాన కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ హారతి ద్వారకనాథ్ మాట్లాడుతూ.. సత్యసాయి జ్ఞాన కేంద్రం విద్య వైజ్ఞానిక సామాజిక సాంస్కృతిక ఆధ్యాత్మిక రంగాల్లో ముందడుగు వేస్తూ నిర్మాణాత్మకమైన పాత్రను పోషిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర సింగ్ ఠాకూర్, పశు వైద్య నిపుణులు పీవీ పున్నయ్య, ప్రభాకరరావు, శ్రీనివాస్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సత్యనారాయణ గౌడ్, జిల్లా స్పిరిచువల్ కోఆర్డినేటర్ బందప్ప గౌడ్, పాపయ్య, సతీష్ చంద్ర, విఠోబా, డాక్టర్ ముద్ద భక్తవత్సలం, గోపాల్ రెడ్డి, బసవేశ్వర్, సేవాదళ్ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

దండుమైలారంలో దారుణం

- 11 గుంటల భూమి కోసం నాలుగేళ్లుగా అన్నదమ్ముల కొట్లాట
- ఆదివారం కత్తులు, గొడ్డళ్లతో దాడులకు దిగిన వారసులు
- ఒకరి మృతి.. చావుబతుకుల మధ్య మహిళ
- పలువురికి గాయాలు



బాల్‌రాజ్ మృతదేహం

ఇబ్రహీంపట్నం: భూ వివాదం ఒకరి ప్రాణాలు తీయగా.. మరో మహిళ చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని దండుమైలారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గుడేటి జంగయ్యకు 156, 158, 159 సర్వేనెంబర్లలో 18.12 ఎకరాల భూమి ఉంది. నాలుగేళ్ల క్రితం జంగయ్య ఆయన నలుగురు కుమారులైన నర్సింహ, యాదయ్యకు 4.28 ఎకరాలు, మల్లయ్యకు 4.17 ఎకరాలు, జంగయ్యకు 4.18 ఎకరాల చొప్పున భూమిని పంచారు. మల్లయ్య, జంగయ్యలకు 11 గుంటల భూమి తక్కువగా రావడంతో నాటి నుంచి ఈ భూ పంచాయతీ కొనసాగుతూ వస్తోంది. పోలీస్‌స్టేషన్‌లోనూ ఇరువర్గాల వారు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆర్డీఓ సదరు వివాదస్పద భూమిలోకి ఎవరూ వెళ్లొద్దని 145 ఆర్డర్ జారీ చేశారు. కాగా ఆదివారం నాట్లు వేస్తున్నట్లు తెలుసుకున్న మల్లయ్య, జంగయ్య వారసులు బాల్‌రాజ్(బాలయ్య), ధన్‌రాజ్, వెంకటరాజ్, పర్వతాలు, పావని, మంజుల అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో నర్సింహ, యాదయ్య వారసులు బాలరాజు, శ్రీశైలం, లింగస్వామి, యాదయ్య, ప్రసాద్, పద్మ, హర్షిత, పారిజాత తదితరులు గొడ్డళ్లు, కత్తులతో దాడికి దిగారు. బాల్‌రాజ్‌పై గొడ్డలితో దాడి చేస్తున్న క్రమంలో అతని మరదలు(తమ్ముడి భార్య) అడ్డుకునేందుకు యత్నించగా ఇరువురిపై వేటు వేశారు. బాల్‌రాజ్‌ను ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మంజుల తీవ్ర గాయాలతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మరో నలుగురు క్షతగాత్రులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైరి వర్గానికి చెందిన బాలరాజ్, శ్రీశైలం, లింగస్వామి, యాదయ్య, పారిజాత సైతం గాయాలతో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సోమవారం అంత్యక్రియలు

దండుమైలారం గ్రామ శివారు గొడ్డళ్లు, కత్తుల దాడితో రక్తసిక్తమయ్యాయి. ఉదయం 8 గంటల ప్రాంతంలో అరుపులు, కేకలతో రణరంగాన్ని తలపించాయి. నాలుగేళ్లుగా కొనసాగుతున్న భూ పంచాయితీ ప్రాణాలు బలి తీసుకుంటుందని ఎవరూ ఊహించలేకపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున ఘటనాస్థలికి చేరుకున్నారు. కుమారుడిని పోగొట్టుకున్న తండ్రి మల్లయ్య కుమిలిపోతుండడంతో చూసి గ్రామస్తులు కంటతడిపెట్టారు. మృతుడు బాల్‌రాజ్‌కు ముగ్గురు పిల్లలుండగా.. తీవ్రంగా గాయపడిన మంజులకు ఇద్దరు పిల్లలతో పాటు ఆరు నెలల కుమారుడున్నారు. బాల్‌రాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ మేరకు పోలీసులు గ్రామంలో పటిష్టబందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్పత్రుల వద్ద పోలీస్ పహారా ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ నేత ప్రోద్బలంతోనే..

నియోజకవర్గానికి చెందిన ఓ కాంగ్రెస్ నేత ప్రోద్బలంతోనే ఈ దారుణం జరిగిందని మృతుడు బాల్‌రాజ్ సోదరుడు ధన్‌రాజ్ ఆరోపించారు. ఈ భూవివాదం సమసిపోకుండా ఆ నేతనే అడ్డుపడ్డాడని అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



చెరువు కట్ట కిందకు దూసుకుపోయిన వాహనాన్ని తీస్తున్న యువకులు

దుద్యాల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెరువు కట్ట కిందకు దూసుకెళ్లడంతో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండల కేంద్రం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని అల్లిఖాన్ గ్రామానికి చెందిన మంగళి వెంకటయ్య పని నిమిత్తం మండల కేంద్రానికి తన ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో దుద్యాల్ సమీపంలో ఉన్న గోపన్ చెరువు కట్టపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డాడు. ఒక్కసారిగా చెరువు కట్ట కిందకు దూసుకెళ్లడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చెరువు కట్ట కిందకు దూసుకుపోయిన వాహనాన్ని స్థానికులు శ్రమించి బయటకు తీశారు. అలాగే కట్టపై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం..

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలంరాయిలో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలంరాయిలోని పబ్లిక్ టాయిలెట్స్ వద్ద ఫుట్‌పాత్‌పై సుమారు 25–30 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు ఉమేష్ అనే వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ సిబ్బంది 108 సిబ్బందితో కలిసి అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అయితే మృతుని వివరాలు తెలియరాలేదు. సంబంధీకులు ఎవరైనా బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

ఫిలిం స్కూల్‌లో ప్రొఫెసర్‌కు వేధింపులు

విద్యార్థికి రిమాండ్



నిందితుడు భరత్‌రెడ్డి

ఫిలింనగర్: రామానాయుడు ఫిలిం స్కూల్‌లో మహిళా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మహిళను వేధిస్తున్న విద్యార్థిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని రామానాయుడు స్టూడియో ఆవరణలోని రామానాయుడు ఫిలిం స్కూల్‌లో రెండేళ్లుగా ఓ మహిళ (34) ప్రొఫెసర్‌గా పని చేస్తోంది. గత ఏడాది ఆగస్టు నెలలో అనంతపురం జిల్లా, పెనుగొండ మండలం, సోమన్‌దేపల్లి దుర్గానగర్‌కు చెందిన ఎస్.భరత్‌రెడ్డి డైరెక్షన్ కోర్సులో చేరాడు. ఆ తర్వాత కొన్నాళ్లకే అతను ఆమెను కలిసి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. దీంతో ఆమె హద్దులు దాటవద్దని, మరో సారి ఇలాంటి ప్రపోజల్స్ చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. పలుమార్లు ఆమె వార్నింగ్ ఇచ్చినా భరత్‌రెడ్డి ఆమెను వెంటాడుతూనే ఉన్నాడు. ఆయన ప్రవర్తన కూడా సరిగ్గా లేకపోవడంతో పాటు బాధితురాలు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయడంతో అతడిని గత ఫిబ్రవరిలో స్కూల్ నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఆమెకు ఇన్‌స్టా గామ్‌లో మెసేజ్‌లు పెడుతూ ఫాలో అవుతూ వస్తున్నా డు. ఆమె ఎక్కడికి వెళ్లినా ఆయా స్థలాల ఇన్‌స్టాగామ్‌లో గుర్తిస్తూ అక్కడికి వెళ్తున్నాడు. ఈ నెల 22న ఆమె మూన్ షైన్ పబ్‌కు వెళ్లగా ఆ విషయాన్ని ఇన్‌స్టాలో తెలుసుకున్న భరత్‌రెడ్డి అక్కడికి కూడా వెళ్లాడు. ఈ నెల 25న స్టూడియోలోని రైటర్స్ రూమ్‌లో కూర్చొని ఉండగా అక్కడికి వచ్చి ఆమెను అనుసరించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు భరత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ సూచనల మేరకు అతిథి అధ్యాపకుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, డిగ్రీ కళాశాలలో కామర్స్ కోర్సులో బోధనకు ఈ నియామకాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకు గాను సంబంధిత సబ్జెక్టులో పీజీ, డిగ్రీ పొంది ఉండాలని జనరల్ అభ్యర్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగినవారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ వంటి అదనపు అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో చేవెళ్ల డిగ్రీ కళాశాలలో అందజేయాలని కోరారు. దరఖాస్తులను అందించేందుకు సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంటుందని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధిక వర్షం.. పంటలు భద్రం

- నీరు నిల్వడంతో ఉద్యాన పంటలకు నష్టం
- సస్యరక్షణ చర్యలతో ఊరట
- ఉద్యానవన అధికారి అక్షితరెడ్డి



నవాబుపేట: సాధారణ వర్షపాతం పంటలకు ఎంత మేలు చేస్తుందో.. అధిక వర్షపాతం అంతకన్నా ఎక్కువ నష్టం చేస్తుంది. ఇటీవల కురుస్తున్న వానలతో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నవాబుపేట, మోమిన్‌పేట, మర్పల్లి మండలాల్లో 6,500 ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగు చేశారు. ప్రస్తుతం అధిక వానలతో ఆ పంటలు పూర్తిగా చెడిపోయే ప్రమాదం పొంచి ఉంది. కావునా తగు చర్యలు తీసుకుంటే రైతులు వారి పంటలను కాపాడుకోవచ్చని ఉద్యాన వన అధికారి అక్షితరెడ్డి పేర్కొంటున్నారు.

నీటి నిల్వతో..

- ▲ చీడ పీడల ఉధృతి పెరుగుతుంది.
- ▲ వేర్లు కుళ్లిపోయి మొక్కలు చనిపోతాయి.
- ▲ భూమిలో పోషకాలు అందవు. విత్తనాలు మొలకెత్తవు.
- ▲ గాలితో తేమ పెరగడం వల్ల రక్షిత గృహాలలో(పాలి హౌస్, నెట్ హౌస్) కూడా బూడిద, ఇతర తెగుళ్లు పెరుగుతాయి.
- ▲ వీలైనంత త్వరగా పంటపొలాల్లో నిల్వ ఉన్న నీటిని తీసివేయాలి.
- ▲ లేత తోటలతో చనిపోయిన మొక్కలను తీసివేసి కొత్త మొక్కలు నాటుకోవాలి.
- ▲ పంట ఎదుగుదలకు ఎరువులను వేసుకోవాలి. ముఖ్యంగా యూరియా, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి.
- ▲ అధిక తేమ, పురుగుల నివారణ చర్యలు తీసుకోవాలి.



నవాబుపేటలో ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

మామిడి, జామ, సపోటా తోటల్లో

- విరిగిన కొమ్మలను కత్తిరించి పైభాగాన బోర్డో పేస్ట్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను పూతగా పూయాలి.
- యూరియా, మ్యూరెట్ ఆఫ్ పొటాష్, పశువుల ఎరువులను వేయాలి.
- వేర్ల తెగుళ్ల నుంచి కాపాడటానికి కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 3 గ్రాములు లీటర్‌కు చొప్పున మొదళ్ల వద్ద తడపాలి.
- పక్షి కన్ను(ఆంత్రాక్నోస్) తెగులు, పండు కుల్లు వంటి తెగుల్ల నివారణకు కార్బండిజమ్ 1 గ్రాము లీటర్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- వడల తెగులు నివారణకు ట్రైకోడర్మా విరిడి మిశ్రమాన్ని, 30 కిలోల పశువుల ఎరువు, 4 కిలోల వేప పిండి కలిపి ఒక్క చెట్టుకు వేయాలి.
- మొక్కకు పిందెలు, కాయలు ఉన్నట్లు అయితే ప్లానోఫిక్స్ 2 గ్రాములు 100 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కూరగాయ పంటలపై..

- మొలక శాతం తగ్గడం, విత్తనాలు, వేర్లు కుళ్లిపోవడం.
- నీటిలో మినిగిన ఆకులు, మొక్కలు కుళ్లి పోవడం.
- పోషకాల లభ్యత తగ్గిపోవడం, సేద్యపు పనులలో ఆలస్యం, కలుపు బెడద ఎక్కువ అవుతాయి.
- పరాగ సంపర్కం తగ్గి దిగుబడి తగ్గుతుంది. చీడ పీడల బెడద పెరుగుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ▲ టమాట, మిర్చి, వంకాయ, బెండ, క్యాబేజీ, క్యాలి ఫ్లవర్ తదితర పంటల్లో ఎండు, కుల్లు తెగుల్ల నివారణకు సాఫ్ 2 గ్రాము, లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లేదా కవచ్ 2 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ▲ మురుగు నీరు తీసువేసి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 2.5 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ▲ 13–0–45 10 గ్రాములు ప్లస్‌మ్యాక్స్ 2 గ్రాములు ఒక లీటర్ లీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పరిశుభ్రతలో కార్మికులే కీలకం

తాండూరు మున్సిపల్ కమిషనర్ యాదగిరి



మున్సిపల్ కార్మికులకు జాకెట్స్ పంపిణీ చేస్తున్న కమిషనర్ యాదగిరి

తాండూరు టౌన్: పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చడంలో కార్మికులదే కీలక పాత్ర అని మున్సిపల్ కమిషనర్ యాదగిరి అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్మికుల గుర్తింపులో భాగంగా వారికి జాకెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను విధిగా నిత్యం తొలగించాలన్నారు. చెత్త తరలింపుపై మున్సిపల్ జవాన్లు ఎప్పటికప్పుడూ వాకబు చేస్తుండాలన్నారు. ప్రజలు కార్మికులను సులభంగా గుర్తించేందుకు వారికి జాకెట్స్ అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మణిపాల్, ఏఈ ఖాజాహుస్సేన్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఉమేష్ జవాన్లు శ్రీనివాస్, వీరన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలి

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ



పోతుగల్‌లో నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణ

షాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోతుగల్, సీతారాంపూర్ గ్రామాల్లో నూతన కమిటీ నియమించారు. సీతారాంపూర్ అధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పాండు, యువజన అధ్యక్షుడిగా రమేష్, పోతుగల్ గ్రామ అధ్యక్షుడిగా వీరంపల్లి యాదయ్య, ఉపాధ్యక్షుడిగా మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు నవీన్, యువజన అధ్యక్షుడిగా కావలి అరవింద్, ఉపాధ్యక్షుడిగా కుమ్మరి నవీన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తామని, జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలందరూ రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలందరూ పోటీకి సిద్ధంగా ఉండాలని చెప్పారు. బీసీల హక్కుల సాధనకు తాము నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీసేన మండల అధ్యక్షుడిజీ దయాకరచారి, ఉపాధ్యక్షుడు మీరంపల్లి అజయ్‌కుమార్, నాయకులు మహేందర్, శ్రీశైలం, శివ, అబ్బాస్, మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సందీప్, రాములు, చారి, బాలకృష్ణ, పాండు, శ్రీనివాస్ ముదిరాజ్, సురేష్, జగన్, వెంకటయ్య, రాజుగౌడ్, మల్లేష్, పోచయ్య, వెంకటేష్, జైపాల్, కృష్ణ, శ్రీశైలం తదితరులున్నారు.



దౌల్తాబాద్ శివారులో సాగు చేసిన పత్తిపంటలో గడ్డి

కలుపుతో కలవరం

- పత్తి చేలల్లో విపరీతంగా పెరిగిన గడ్డి
- కురుస్తున్న వర్షాలతో రైతులు ఇబ్బందులు
- కూలీలకు పెరిగిన డిమాండ్

దౌల్తాబాద్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటల్లో కలుపు మొక్కలు పెరిగి రైతులను కలవరపెడుతున్నాయి. దీంతో ప్రధానంగా పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో నీరు నిలిచి ఉండడంతో పనులు కాస్త మందగించాయి. మండలంలో 34 గ్రామపంచాయతీల్లో సుమారు 4వేలకుపైగా ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు.

గుత్తకే ప్రాధాన్యం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎక్కడ చూసిన పత్తి పంటనే ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. చేలల్లో పత్తితో పాటే గడ్డి మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో ఇబ్బందులు తప్పడంలేదు. కూలీలకు వర్షం అడ్డంకిగా మారింది. కూలీలు కూడా పత్తిలో పాటు పెరిగిన గడ్డిని చూసి గుత్త మాట్లాడుకుంటున్నారు. ఒక ఎకరానికి రూ.6వేల నుంచి 7వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. రోజు కూలీ అయితే ఒక్క కూలికి రోజుకు రూ.300నుంచి 350 వరకు అడుగుతున్నారు. దీంతో కొంత మంది రైతులు గడ్డి మందు పిచికారీ చేస్తున్నారు. దీంతో పంటకు కొంత నష్టం కలుగుతుందని భావించి మరి కొందరు ఖర్చుకు వెనుకాడకుండా కూలీలతో కలుపు తీయిస్తున్నారు. ఇప్పుడిప్పుడే పత్తి పంట ఎదుగుతున్న క్రమంలో చేలల్లో పంటకు ఖర్చు పెడితే రానున్న రోజులు ఇంకెంత ఖర్చు భరించాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూలి ఎక్కువ



ప్రస్తుతం కురుస్తున్న వాన లకు పత్తి చేలల్లో విపరీతంగా గడ్డి పెరిగింది. దీంతో కూలీల కోసం చాలా ఇబ్బంది అవుతుంది. కూలి ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. గుత్తగా మాట్లాడుతూ రూ.వేలల్లో డిమాండ్ చేస్తున్నారు. పంటల సాగు ఒక ఎత్తయితే దాన్ని కాపాడుకోవడం మరో ఎత్తయింది.

– బసయ్య, రైతు, దౌల్తాబాద్

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై నిరసన



తాండూరు టౌన్: రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



పూడూరులో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను స్థానిక బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక నేతాజీ చౌక్‌లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మకు నిప్పంటించి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ బీజేపీ అభ్యున్నతిని తట్టుకోలేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నట్లు చెప్పారు. ఆయన దేశ ప్రధాని మోదీ తల్లిపట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు పటేల్ విజయ్, సుదర్శన్ గౌడ్, కృష్ణ, ప్రకాష్, కిరణ్, శ్రీనివాస్, షాబుద్దీన్, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

పూడూరు: బిహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిపై రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సినిమా సెన్సార్‌బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు రవీందర్, వెంకటయ్య, శ్రీశైలం, రాజు, క్రిష్ణచారి, నవీన్‌జోషి, పాండు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి..

కుత్బుల్లాపూర్: క్వారీ గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం కొంపల్లి జయభేరి పార్కు ప్రాంతంలోని క్వారీ గుంతలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడిని హస్మత్‌పేట్‌కు చెందిన మహ్మద్ షాహిద్(17)గా గుర్తించారు. ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

యువ సాఫ్ట్‌వేర్ మృతి



రవికుమార్ (ఫైల్)

కొత్తూరు: గుండె నొప్పితో ఓ యువ సాఫ్ట్‌వేర్ మృతి చెందాడు. ఈ ఘటన కొత్తూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్‌కు చెందిన రవికుమార్(31) ఎనిమిదేళ్ల క్రితం పారిస్ వెళ్లి అక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేశాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు తరచూ గ్రామం నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నాడు. శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి వస్తుండగా మార్గమధ్యలో ముగ్గురికి లిఫ్ట్ ఇచ్చాడు. కొత్తూరు సమీపంలోకి రాగానే ఛాతిలో నొప్పి రావడంతో కారు అదుపుతప్పింది. కారులో ఉన్నవారు గమనించి ఆయన్ను వెంటనే స్థానికంగా ఉన్న లీమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్ తరలించాలని సూచించారు. అంబులెన్స్ వచ్చేలోగా ఆయన తుదిశ్వాస విడిచాడు. మృతుడికి ఏడు నెలల క్రితం వివాహమవ్వగా ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణసింగ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రైలు పట్టాల మధ్య గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురెళ్లి సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై స్కై బ్లూ కలర్ చొక్కా, అదేరంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

బాలాపూర్.. భాగ్యమెవరికో!

నగరంలో గణేశ్ లడ్డూకి భలే క్రేజ్

- వేలంలో దక్కించుకునేందుకు పోటీపడుతున్న భక్తులు
- లడ్డూతో పాటు వెండి పళ్లెం బహూకరణ



మండపం వెలుగులు

బడంగ్‌పేట్: గణేశ్ నవరాత్రోత్సవాలకు హైదరాబాద్ మహానగరం ప్రసిద్ధి. ఏటా నిర్వహించే గణనాథుడి సంబరాలకు నగరమంతా ఉప్పొంగుతోంది. అందులో శివారు ప్రాంతంలోని బాలాపూర్ వినాయకుడి ప్రాధాన్యం గురించి చెప్పనక్కర్లేదు. అంతగా క్రేజ్ ఉంటుంది. మరీ ముఖ్యంగా లడ్డూ వేలంతో ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. కోరిన కోర్కెలు తీర్చే భగవంతుడి ప్రసాదంగా భక్తుల విశ్వాసం చూరగొనడంతో లడ్డూను కైవసం చేసుకునేందుకు భక్తులు పోటీ పడుతుంటారు.

ప్రత్యేకత

నవరాత్రులు పూజలందుకున్న బాలాపూర్ గణేశుడి భారీ లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు ఏటా రూ.లక్షలు వెచ్చించి వేలంలో పోటీ పడుతుంటారు. ప్రసాదం సొంతం చేసుకున్న వారు.. తమ పంటపొలాలు, వ్యాపార సంస్థలు, కార్యాలయాల్లో చల్లి అధిక దిగుబడులు, రాబడులు అందుకోవడమే కాకుండా వ్యాపారంలో గతం కంటే మరింత లాభాలు ఆర్జిస్తున్నట్లు లడ్డూను కొనుగోలు చేసిన భక్తులు పేర్కొంటున్నారు.

21 కిలోల లడ్డూ

ఆంధ్రా ప్రాంతానికి చెందిన తాపేశ్వరం మిఠాయి తయారీదారులు లడ్డూను తయారు చేస్తున్నారు. నాణ్యత, సైజు(21 కిలోలు) విషయాల్లో నాటి నుంచి నేటి వరకు ఎలాంటి తేడా లేనప్పటికీ.. లడ్డూను ఉంచేందుకు 2 కిలోల వెండి గిన్నెను, వేలంలో లడ్డూ దక్కించుకున్న వారికి ఇస్తున్నట్లు హనీ ఫుడ్స్ తయారీదారుడు ఉమామహేశ్వర్ తెలిపారు.



కొలువైన గణనాథుడు

1980లో మొదలై..

46 ఏళ్లుగా బాలాపూర్ లడ్డూ చరిత్ర సృష్టిస్తోంది. 1994లో కొలన్ మోహన్‌రెడ్డి రూ.450తో ప్రారంభించిన వేలం పాట.. నిర్విరామంగా కొనసాగుతోంది. 2024లో రూ.30 లక్షలకు పలికి రికార్డు చేరుకుంది. ఈ సారి ఎంత ధర పలుకుతుందో అని అందరూ వేచి చూస్తున్నారు. వేలంలో వచ్చిన నగదును వివిధ ఆలయాల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధి, ప్రజాసేవ తదితర కార్యక్రమాలకు వినియోగిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.

పటిష్ట బందోబస్తు

భారీ సైజులో ఉండే బాలాపూర్ గణనాథుడి నిమజ్జనానికి తరలించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తారు. పాతబస్తీ, బార్కస్, చాంద్రాయన్‌గుట్ట, అలియాబాద్, చార్మినార్, ముస్లింబస్తీలు, కాలనీల మీదుగా ఊరేగి హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం అవుతుంది. ఈ విగ్రహాన్ని కదిలించిన తర్వాతే నగరంలోని మిగతా పెద్ద గణనాథులను తరలించే సంప్రదాయం కొనసాగుతోంది.

గతంలో లడ్డూను దక్కించుకున్నవారు

పేరు	సంవత్సరం	రూపాయల్లో
కొలన్ మోహన్‌రెడ్డి	1994	450
కొలన్ మోహన్‌రెడ్డి	1995	4,500
కొలన్ కృష్ణారెడ్డి	1996	18,000
రమేశ్‌యాదవ్, శశాంక్‌రెడ్డి	2021	18.90 లక్షలు
వంగేటి లక్ష్మారెడ్డి	2022	24.60 లక్షలు
దాసరి దయానందరెడ్డి	2023	27 లక్షలు
కొలన్ శంకర్‌రెడ్డి	2024	30 లక్షలు

అన్ని వసతులు కల్పించాం



ఈసారి గణనాథుడి మండపాన్ని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనాలో ఏర్పాటు చేశాం. వినాయకుడి తలపై శివుడు, నాగ పడగలు, సింహంపై కూర్చునట్లుగా స్వామివారు దర్శనం ఇస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను కల్పిస్తున్నాం. మండపం చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. వీఐపీల దర్శనాలకు పోలీసులు సహకరిస్తున్నారు.

– కళ్లెం నిరంజన్‌రెడ్డి, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు

కొత్త నిబంధన



వినాయకుడి చేతిలో లడ్డూ

లడ్డూ వేలంలో పాల్గొనే వారికి ఈసారి ఉత్సవ కమిటీ నిర్వాహకులు కొత్త నిబంధన అమలు చేస్తున్నారు. గతంలో వేలానికి ముందుగా రూ.5 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకునేవారు. మారిన నిబంధన ప్రకారం గతేడాది రూ.30 లక్షలకు లడ్డూ చేరుకుంది కనుక ఈసారి రూ.20 లక్షలు ముందుగానే చెల్లించాలని షరతు పెట్టారు. అయినప్పటికీ భారీగానే ఆశావహులు డబ్బులు చెల్లించి పేర్లు నమోదు చేసుకుంటున్నారు.